యిం చెల్లించుకున్నాయి. అరె, అంత బరువుంటా యనుకోలేదురా, అన్నాడు కృష్ణమూర్తితో. ఏం తుపాను రేపుతుందో నన్న అనుమానం వున్నా పోనీలేరా చెయ్యేవరికేనా జారుతుంది. ప్రమాదం అంటూ పార్వతి వస్తూంది. నువ్వే చెప్పు జగ్గాయి అన్నట్లు ఓ చిరునవ్వు విసిరి కాళ్లు కడుక్కొందుకు వెళ్ళాడు కృష్ణమూర్తి.

చెయ్యిజారి పోయిందే పారూ, పగలాయి మళ్ళీ కొందాంలే. అంటున్న జగ్గాయి చేతిలో బొమ్మముక్కలు చూసి పార్వతి కళ్లు వర్షించడం మొదలుపెట్టాయి. జగ్గాయి ఓదార్చాడు. నీకేం కావలిస్తే అది కొనిస్తానన్నాడు. గారాబంగా పెరిగిన చెల్లెలి మనస్సు కష్టపడిందే అని బాధ పడ్డాడు. పార్వతి ఏడుస్తూనే చెప్పింది: తనసలు ఆ ఒరిస్సాదుప్పటీ కొంటాడేమో అనుకుంది. కాని కృష్ణ యీ బొమ్మలు తెచ్చాడు. పోనీ అనుకుంటే, ఇంక మాటరాలేదు. జగ్గాయికి తెలిసింది: పార్వతికేం కావాలో. అంతేకావాలి పార్వతికికూడా.

భోజనాలు చేస్తూంటే పార్వతి లోపలికివచ్చి హడావిడిగా నూకాల్ని బజారుకిపంపింది. నూకాలు చేత ఒక పాకెట్టు కట్టుకువెళ్ళింది. చేత యింకో పేకెట్టుతో వచ్చింది. జరిగింది: ఇంద్రజాలం. మాంత్రికుడి మాయ.

ఉదయాన్నే స్నానంచేసి, జరీ తెల్లచీరతో చిరునవ్వులతో కృష్ణమూర్తిని లేపడానికి వచ్చింది పార్వతి. ఆప్యాయంగా కౌగిలిలోకి తీసుకుంటూ, ఏదీ నా బహుమతీ? అని అడిగాడు. ఇదిగో అంటూ అతని చేతిలోపెట్టింది సిగరెట్టుకేసు. యింకా గట్టిగా కౌగిలించుకున్నాడు కృష్ణమూర్తి.

జగ్గాయి హాల్లోంచి కేకవేస్తున్నాడు. రావే అక్కడేం వుందీ? పారూ! యిదిగో నీ బహుమానం అంటూను. యిద్దరూ యివతలికివస్తే పార్వతి ముఖం పద్మంలా వికసించింది. కృష్ణమూర్తికి మైకం వచ్చినంత పనైంది. అందాకా జగ్గాయికోసం అమర్చిన మంచంమీద అమాంతం ఒరిస్సా దుప్పటి పరిచివుంది...

అతనెవరో దీన్ని కొనుక్కువెళ్లారట, ఎంతో తనో నిన్ననే తెప్పియిచ్చారట. నయం. నా అదృష్టం కూడా బాగుంది అన్నాడు జగ్గాయి.

అప్పుడే హాల్లోకి వస్తూన్న నూకాలు అదేంటమ్మాయిగోరూ, అది మాదానిలాగే వుందే... అంటూ యింకా ఏదో అనబోతోంది. పార్వతి కళ్ళలో ఏంమాట్లాడినదో చటుక్కున వూరుకుంది. యిదంతా చూస్తూన్న కృష్ణమూర్తికి జరిగిన ఇంద్రజాలం అర్థం అయినా, మహా జ్ఞానిలా, తత్త్వవేత్తలా వూరుకున్నాడు; ఉత్సాహంగా చిన్నపిల్లలా తేలిగ్గా తేలిపోతూన్న పార్వతి అందమైన విగ్రహం చూస్తూ—ఫరవాలేదు, యీ భయంకరమైన ఒరిస్సా దుప్పటీని భరించవచ్చు — అనుకున్నాడు.

---

క థా ని క

# శకున ఫలితం

వసంతరావు కులకర్ణి

తెల్లవార్తూనే పిల్లిని జూస్తే యేం జరుగుతుందో మీకందరికీ బాగా తెలుసు. కాని నాకు గలిగిన శాస్తి మరెవ్వరికీ కలుగలేదనుకొంటాను. అది వేసవికాలము. రాత్రి అన్నము తిని అంగణములో ప్రక్కపరుచుకొని హాయిగా పడుకొన్నాను. పౌర్ణిమ, గ్రీష్మఋతువు ఆకాశము స్వచ్ఛముగా నున్నది. పూర్ణచంద్రుడాకాశమున ఉదయించినాడు. పండువెన్నెల తెల్లగా పిండిచల్లినమాదిరిగా నున్నది. ఆకాశమునకేసి చూస్తూ చుక్కల్ని లెక్కపెడ్తూ వుండగా నిద్రపట్టినదే తెలియదు.

తెల్లవార్తూనే శనివారము. మొదటితేదీ. ఒకేపూటాఫీసు కనుక తొందరగా వెళ్ళాలని మెల్లిగా కప్పుకొన్న పచ్చడము తీస్తూనే ఆకాశమున చందమామకు బదులుగా, కావు! కావుమని అరుస్తూ కాకులగబడ్డాయి. ఛా! అని మొగవ తిప్పుకొనేసరికి నల్లనిపిల్లి గ్రుడ్లు తెరచుకొని మ్యాఃమంది. తస్సగొయ్య!, యిటు తిరిగేసరికి ప యిల్లాడ్చే యెల్లి శౌరకట్టు పట్టుకొని అయా

అంది! నీదుంపతెగా అని మళ్ళీ కప్పుకొన్నాను. ఇంతలో మా నాన్నమ్మ "ఏమిట్రా, మధూ యింక లేవవురా, యీ రోజు శనివారం, ఒకపూటాఫీసు గదూ" అని కేకవేసింది.

పీరిపీడా వదల్లా, నిద్రమబ్బుకూడా వదల హా వుంది. ఇంకా పావుగంటసేపు లోనికెళ్ళి పడుకొందామని గట్టిగా కళ్ళుమూసుకొని లోపలి కెళ్ళుచుండగా మంచపుకొయ్య నొసటికి ఠణామని మ్రోగింది.

"శ్రీ గణేశాయనమః" అనుకొన్నాను. ఇక మబ్బు వదిలిపోయింది.

ఇక పడుకొంటే కుదరదు. ఒకదిక్కున ఆఫీసు వేళైంది. మరోదిక్కు కోపం, మంట. తల నిమురుతూ, రౌద్రంతో లోనికెళ్ళేసరికి, మా యావిడ "ఈ పూటకి గొల్లది పాలు పోయలేదండి" అన్నది. చిన్నపిల్ల గోల వినలేక ఒకణా యిచ్చి పెద్దబ్బాయిని పంపిస్తే అది కాస్తా యెక్కడో పడవేసి చచ్చు మొగం చేసుకొని వచ్చాడు. కోపం భరించలేక, రౌద్రంతో, "వెధవా, ఒకటోలేది. పైసలు లేవని మొత్తుకుంటే, అది కాస్తా పోగొట్టుకొచ్చావా. గాడిదా" అని నాల్గు మోదాను. కుయ్యో! మొఱ్ఱో! అంటు యిటు పెద్దవాడు, పాలకొరకటు చిన్నది. కాఫీ కొరకు మాయావిడ, గోలబెట్టేసరికి యేమి తోచక చతికిలబడి పోయాను!

కాస్సేపటికి చిన్నదాన్ని మాయావిడో దార్చింది. మరి పెద్దవాణ్ణి "సీను! మా అబ్బాయి చాల మంచివాడవుగదు. యేడ్వకురా, మరీ నీకొచ్చేటప్పుడు చాక్లేట్లు కొనితెస్తాను సరేనా?" అని నేనోదార్చ ప్రయత్నించాను. "ఊ! నాకు కొత్తపలక కావాలి." "సరే పలకనేతే" అని వోదార్చి గబగబా స్నానముచేసి ఆఫీసు వేళైనందువలన అన్నము తినకుండానే బట్టలు తొడుగుకొన్నాను. కూర్చొని బూట్లు తొడుగుకొనుచుండగా, వెనికిలా చిన్నమ్మాయివచ్చి "నాన్నా" అంది. పడ్తుందేమోయని పట్టుకొనబోయేసరికి చేతికి మాత్రమంటింది. పంపుదగ్గరికిం బోయేసరికి క్రొత్తజోళ్ళైనందువలన జారి ధబీల్లుమని పడ్డాను. వీటన్నిటితోపాటు గుడ్డలకి బురదగూడా అంటింది.

మెల్లగాలేస్తూ, "ఏవిటే?" అన్నాను.

"ఏమండీ" అంది.

"మరి ఆ చాకలిగాడిద బట్టలుతేలేదా?" అన్నాను.

"రెండు నెలలనుండి డబ్బివ్వనందులకు తేలేదండి" అని లోనుండే అరచినది.

దేవుడానిలేచి, కాళ్ళు మొగము కడిగికొని, బట్టలువిడిచి శుభ్రంగా ధోవతీ కట్టుకొని, చొక్కా లేకుండానే-పెళ్ళిలో మా మామయ్యగారిచ్చిన సిల్కు షేర్వాని వేసుకొని తొందర తొందరగా బస్సు స్టేజీ కెళ్ళాను. జన సమూహం యెక్కువగా వుంది. ఆఫీసు వేళైందని తెలిసి సహితము "క్యూను" లక్ష్య పెట్టకుండా ముందరికి దూరాను. "Indians are educated fools" అన్న సామెతను సార్థకము చేశాను. 'క్యూ'లోని వాళ్ళు గోలపెట్టేసరికి. పోలీసువాడొచ్చి మెడబెట్టి గెంటేశాడు. షేర్వాని దులుపుకుంటు యెవరైనా మిత్రులున్నారేమోనని అటు యిటు జూశాను. బ్రతుకు జీవుడాని రెండో బస్సు దిగి తొందరతొందరగా నడుస్తూ ఆఫీసు కెళ్ళాను. పదిహేను నిముషములు గడిచిపోయినది. మెల్లిగా కుర్చీలో కూర్చునబోయేసరికి ఆఫీసు ప్యూనొచ్చి, "అయ్యగారు పిలుస్తున్నారండీ" అన్నాడు. ప్రాణాలు బిగబట్టుకొని లోనికెళ్ళాను. నను జూచేసరికి ఆఫీసర్ కోపంతో మండిపడుతూ, "ఏమిటి మధూ! ఇదాఫీసా లేక క్లబ్బనుకొన్నావా యెప్పుడంటే అప్పుడు రావడానికి, యిది నీ రెండవసారి తప్పు తెలుసా!" అని గద్దించాడు. "లేదండి సార్ బస్సు దొరకలేదని" మెల్లగా జవాబు చెప్పాను. "బస్సు దొరకలేదు. భార్య అన్నము పెట్టలేదు. పిల్లలు వదల్లేదు. అంటే మరి నన్నేమి చేయమన్నావు. ఒక రూపాయి జుర్మానా తెలుసా?"

"క్షమించండి సర్. పిల్లలు గలవాణ్ణి"

"మారుమాటడకపో! నీ పని చూచుకో" అని బెదిరించాడు.

బ్రతుకు జీవుడాని బయటపడివచ్చి కుర్చీలో కూర్చున్నాను. ఇంతలో మిత్రుడొకడొచ్చి,

"అరే! చొక్కా లేకుండానే షేర్వాని తొడుక్కొన్నావురా?" అన్నాడు. అందరు నా దిక్కే చూడ మొదలిడినారు. చచ్చినంతైనది.

"ఆ! మరేమిలేదు, వేసవికాలము, ఉక్క పోస్తుందని వేసుకోలేదు. బట్టకేమి ట్రంకునిండా కిటకిట మూగివున్నాయి" అని చెప్పి తల క్రింది కొంచి గబగబా ఆఫీసు పనిచేయుచు, సారెసారెకు ఆఫీసు క్లాకు సిక్కు ఎకౌంటెంటుగారి దిక్కు చూడ నారంభించితిని. ఇంతలో గోడనున్న గడియారము ఖంగుమని వొంటి ఘంట కొట్టినది. ఇంతవరకు జీతము రాలేదు. ఎకౌంటెంటు గారిని ఏమండి నారాయణరావుగారు అని పలుకరించేసరికి, "చెక్కు రాలేదు నన్నేమి చేయమన్నావు" అన్నాడు. మండుటెండలో కాల్నడక సాగించాను యింటికి. త్రోవలో కాంటీన్‌వాడు, "డబ్బివరేమండిసార్" అన్నాడు, "యింకా జీతము పడలేదయ్యార్" అని చెప్పి గబగబా యింటికొచ్చాను. వరాండాలో అబ్బాయి ఆడుచున్నాడు. "నాన్నా పలక తెచ్చావా?" అన్నాడు.

"నీ తల! పోయి ఆడుకో" మని గదిమాను.

లోపలికొచ్చేసరికి మాయావిడ యెన్నడులేని ప్రేమకనబరుస్తూ (యిటువంటి ప్రేమ నెలకొకసారి తప్పక వొస్తుంది లెండి.) నా షేర్వాని గుండీలను విప్పుతూ, "ఏమండీ జీతము పడ్డదేమో. మరీ యీ నెల జార్జెట్టు చీర తెస్తామన్నారే" అంది. కోపంతో "ఇంట్లో యీగలమోత బయట పల్లకీల మోత," అన్నట్లుంది. డబ్బివ్వనందులకు గొల్లది పాలు పోయలేదు. చాకలి బట్టలు తేలేదు, సిగ్గుందా, జార్జెట్టు చీర కావాలనడానికి! ఇంటిసంగతేవద్దు. ప్రొద్దటినుండి కూడులేక కడుపులోని ప్రేవులు మలమల మాడిపోవుచున్న సంగతేమైనా తెలుసా" అని యన్నాను. "మరీ బావుంది. ఆఫీసు కోపం దెచ్చి మా పైని తీయండి, పదరా సీనూ" అంటూ యేడుస్తూ లోనికెళ్ళి పోయింది.

ఇంతలో మా నాన్నమ్మ, "ఒరే! అబ్బాయి మాగజీను? తెచ్చావట్రా" అంది. "యింకా జీతము పడలేదే" అని గొణుక్కొంటు పోయి నాల్గు ముద్దలు తిని కాస్సేపు పడుకొన్నాను.

నాల్గు ఘంటలకు లేచేసరికి యింటి అద్దెకొరకు సాయబు వచ్చి తగాదా పెడుతున్నాడు. "ఏమయ్యా! రెండు నెలలైంది. ఇంకా యింటి అద్దె యిచ్చుకోవు! రోజు పావలా పెట్టుకొని వీధి గుమ్మం చుట్టు తిరుగుతున్నాను; నేడు యిచ్చి తీరాలి లేక చచ్చి తీరాలి."

"అలాగు కోప్పడ్తెలాగు సాయబు, వస్తే వుంచుకొంటామా? వాడి దుంపతెగ ఎకౌంటెంటు ఇంకా చెక్కు రాలేదని యేడ్చినాడండి! యిక మీరు రానక్కరలేదు. యెల్లుండి సాయంత్రం నేనే వచ్చి యిస్తాను, సరేనా?" అని వాణ్ణి నచ్చచెప్పించేసరికి తలప్రాణం తోకకొచ్చింది. ఓరి భగవంతుడా! ఎందులకొస్తుందో యీ మొదటితేదీ మమ్మల్నేడిపించడానికి. ఇదంతా ఆ పాడు పిల్లి ముఖం చూ నందులకే కాబోలు, ప్రాయశ్చిత్తానికొరకు— వారం ఆంజనేయులకు టెంకాయ కొడ్తే వస్తుందని కాళ్ళు మొగం కడుక్కొని బజారుకెళ్ళాను. "ఏం వెంకమ్మా, కాయలెట్లిచ్చినావు?" అని అడిగేసరికి ఆమె "పావలా. ఏవిటయ్యా, నీమాటకి యెన్ని రోజులైంది డబ్బిచ్చుకోవు?" అంది. "ఇస్తానులే, వెంకమ్మా యిస్తాను, యింకా జీతము పడలేదు" అని కాయను తీసుకొని గుడికెళ్ళాను.

కాయనక్కడుంచి ప్రదక్షిణం చేయసాగితిని. జనసమూహం యెక్కువగా నున్నందున నా కాలొక అమ్మాయి కాలునకు తాకినది. అందులకామె గారు, "ఎవరండి, కళ్ళగపడవు" అంది. "కాదం సందడి యెక్కువగానున్నందువలన తాకినది క్షమించండి" అని చెప్పి లోపలికెళ్ళాను. అక్కడికెళ్ళి కాయను కొట్టగా అది కాస్తా పుచ్చువెళ్ళింది. అందరు ఫక్కున నవ్వారు. "ఇన్సల్టు!" అవమానం భరించలేక తలవంచుకొని పరుగుపరుగునా యింటికొచ్చాను. అప్పటికే ఎనిమిదిఘంటలైనది. ఇక యెవరితోను మాట్లాడితే బావుండదు. ఏలన, "పారిదైవోపగతుండు పోవుకడకున్ పోవున్‌గదా యాకడల్" యన్న పద్యము జ్ఞప్తికొచ్చినది. శుభ్రంగ ప్రక్కపరుచుకొని పడుకొన్నాను. ఖర్మం చాలక, యింతకి సరిపోక పరుపులోవున్న తేలొకటి కుట్టినది. దేవుడాని కప్పుకున్న పచ్చడము తీసేసరికి అదే స్థలములో, అదే పిల్లి అలాగే గ్రుడ్లు తెరుచకొని "మ్యావు" అంది. "ఇంకా వీరిగారి పీడ వదల్లేదా యేమిటి? అని ఒకదిక్కు భయం, కోపం, మంటా; మరోదిక్కు తిన్నగానవ్వువచ్చినవి. ★